# దావీదుపై తుది పలుకు

## (2 సమూ. 21-24; 1 రాజులు 1; 2; 1 దినవృ. 20-29)

"మానవ చరిత్రలో ఆలాటి ఆత్మ సంబంధమైన ప్రభావాన్ని కనుపరచినవారు అరడజను మందికంటె ఎక్కువ ఉండరు" అని దావీదును గూర్చి ఒక పేరు పొందిన రచయిత అన్నాడు,[1] దావీదువంటి జీవితాన్ని ఒకడు ఎలా ముగిస్తాడు?

2 సమూయేలు యొక్క రచయిత విశాలమైన అవగాహననిచ్చే మార్గాన్ని అనుసరించాడు. అబ్షాలోము యొక్క తిరుగుబాటును అణచివేసిన తరువాత, 2 సమూయేలులోని చివరి నాలుగు అధ్యాయాలు దావీదు యొక్క జీవితంలో వివిధ వర్ణములైన దృశ్యాలు - మంచి దినాలు చెడ్డదినాలు - అవి ఎప్పుడు జరిగాయి అనే సూచనతో దాఖలు చేయబడ్డాయి. దావీదు మరణ శయ్యపైనుండి రాజ్యాన్ని సొలొమోనుకు అప్పగించబోయే సమయంలో - దాదాపు ఒక దశాబ్దం తరువాత జరిగిన వాటితో 1 రాజులు ప్రారంభించబడుతుంది.

మరోవైపు 1 దినవృత్తాంతముల రచయిత ఈ విధానాన్ని నొక్కి చెప్పబూనుకున్నాడు. దావీదు తన చివరి పది సంవత్సరాల జీవితం సొలొమోను కొరకు ప్రతిదానిని సిద్ధపరచడం, రాజ్యాన్ని క్రమబద్ధం చేయడం, దేవాలయ నిర్మాణం కొరకు సిద్ధపాటు గావించడం వంటివాటిని జరిగించాడు.

ఈ రెండు విధానాలను గూర్చి నేను ఆలోచిస్తుండగా, ఒక గొప్పవాని మరణాన్ని రెండు టి. వి. వలయాలు ఏ విధంగా చేపట్టుతూ ఉంటాయో అనే సంగతి నాకు జ్ఞాపకం వచ్చింది. ఒక కేంద్రం ఈ మనిషి జీవితం యొక్క ప్రత్యేకమైన దృశ్యాలపై ప్రత్యేక శ్రద్ధ చూపవచ్చు - అందులో హెచ్చు తగ్గులకు సంబంధించిన సంగతులను అతని బలమును బలహీనతలను చూపించడంలో ఆసక్తిని కలిగి ఉండవచ్చు. మరొక కేంద్రం - ఆ మనిషియొక్క అత్యధికమైన విజయాలమీద దృష్టి నిలిపింది. రెండవ సమూయేలు, 1 రాజులు మొదటి కేంద్రం లాటిదైయుండగా; 1 దినవృత్తాంతములు రెండవ దానివంటిదైయుంది.

ప్రత్యేకమైన టి. వి. ప్రోగ్రాములను (కార్యక్రమములను) నేను నా మనస్సులో చిత్రించుకుంటు ఉండగా, మరొక ఆలోచన వచ్చింది: వాటిలో ఏ కేంద్రం కూడా ఆ మనిషి జీవితాన్ని చిత్రించడంలో సంతృప్తి చెందలేదు. ఆ రెండింటిలోను నన్ను చాలా విసిగించేవి ఉంటాయి: మనిషిని విలువ కట్టడంలో "ప్రవీణులు" - ఆ మనిషి విజయం సాధించాడా లేక విఫలుడయ్యాడా - చరిత్రలో అతని స్థానమేమైయుంటుందో చెప్పకపోవడం అంత బాగులేదు. ఈ ఆలోచనకు నా మొదటి ప్రతిస్పందన కోపం చూపాలని, రెండవ ప్రతిచర్య నిద్రావస్థలో పండ్లు అగుపడునట్లు నవ్వాలని. ఈ పరిశీలనలో, ఆ "ప్రవీణుల" పాత్రను నేను వహిస్తున్నా. అప్పుడప్పుడు దావీదు యొక్క

చర్యలు నన్ను భయంకరంగా కుదిపివేశాయి, ఏడ్వాలనిపించింది. "దావీదూ, నీవు ఎలా చేయగలిగావు? దేవునిని, ఆయన వాక్యాన్ని నీవు ప్రేమిస్తున్నావని నేనెరుగుదును! నీవు దీన్ని ఎలా చేయగలిగావు?" ఒకవేళ నీవు కూడా అలాగే చేసియుంటావేమో.

దావీదు జీవితంలోని ప్రదర్శనీయమైన స్వభావాన్ని నేను ఎంతగా ఆలోచిస్తానో, ప్రత్యేక ప్రసారపు పంథాలో ముగింపు చేసి – ముగించాక "నిపుణులు" తమ తీర్పును చెప్పితే బాగుంటుందనుకుంటాను. నీ ఊహను కొంత విశాలపరచవలసి ఉంటుంది. అయితే నాతోనే ఉండు.

## దావీదుపై మనిషి యొక్క తుది పలుకు

అంతంలేని వ్యాపార ప్రకటనల తరువాత ఈ మాటలు తెరపైన కన్పిస్తాయి: "దావీదుపై తుది పలుకు: ట్రూత్ ఫర్ టుడే ప్రత్యేకత." తెరపై అక్షరాలు పోయి మనిషి ముఖం దర్శనమౌతుంది. "మన దినాల్లోని మహా గొప్ప నాయకుడును ఇశ్రాయేలు రాజునైన దావీదు చనిపోగా దేశం అతని కోసం దుఃఖం ప్రకటిస్తోంది. ఈ ప్రత్యేకమైన అభినందనకు మిమ్మును ఆహ్వానిస్తున్నాము. దావీదు జీవితంలోని ముఖ్య ఘటనలు చూడండి. మాతో కూడ గొప్ప కామెంటేటర్స్ ఇమా క్రిటిక్, యూరా క్రిటిక్ అనేవా రున్నారు."

### రాజు లేక ఏలిక (2 సమూ. 21:1-14)

యువకుడైన దావీదు ముఖముపై యుద్ధ శూరుని రూపం కన్పిస్తుంది. "దావీదు ఏడేండ్లకు పైగా సైనిక, సాంఘీక సంక్షోభం తరువాత దేశమంతటికి రాజౌతాడని జ్ఞాపకమున్నవారు గుర్తు చేసికొంటారు. 37 సంవత్సరాల వయస్సులో అతడు సింహాసనం మీద ఆసీనుడౌతాడు. దావీదు బయట శత్రువులతో మాత్రమే గాక, సౌలు పతనం తరువాత మిగిలినవారితో సహా అతడు పోరాడవలసియుంటుంది."

కెమెరా వెనుకకు త్రిప్పబడింది. నిబంధన మందసం ఉన్న గుడారము ఎదుట ఉన్నట్టు దావీదు చూపించబడ్డాడు.[2] ఆకాశంవైపు కన్నులెత్తి అతడు యిలా మాట్లాడతాడు: "యెహోవా, వర్షం లేకుండ మూడు సంవత్సరాలు గడచిపోయాయ్. మా పిల్లలు భోజనం కొరకు అల్లాడుతున్నారు. ఎందుకు యెహోవా, ఎందుకు?" పైనుండి ఒక స్వరం యిలా అంది: "సౌలు గిబియోనీయులను హతము చేసెను గనుక అతనిని బట్టియు, నరహంతకులగు అతని యింటివారిని బట్టియు" (21:1).[3]

దావీదు యెరూషలేమునకు తిరిగి వచ్చే మార్గంలో, కామెంటేటర్ యిలా అన్నాడు: "యెహోషువ ఈ దేశమునకు వచ్చినప్పుడు, నాయకుడు పవిత్రమైన ప్రమాణం చేసేలా – గిబియోనీయులను లయపరచకుండునట్లు – వాగ్దానం చేసేలా ట్రిక్ పన్నారు. తాను మోసగింపబడినట్లు – యెహోషువ గ్రహించినప్పుడు, అతడు గిబియోనీయులను, లేవీయులను నిరంతరం దాసులుగా ఉండి, ప్రత్యక్ష గుడారానికి అవసరమైన కర్ర, నీళ్లు అందించేలా చేశాడు.[4] సౌలు రాజైనప్పటికి, గిబియోనీయులు ఆ దేశంలో మూడు

వందల సంవత్సరాలు నెమ్మదిగా జీవించారు, యెహోషువ వారికి నియమించిన పనులను జరిగిస్తూ వచ్చారు. అయినా, సౌలు వారిని తుడిచివేయ తీర్మానించుకొని – దాదాపుగా సఫలుడయ్యాడు[5] దానికి ప్రతిఫలం ఆలస్యంగా దావీదు పరిపాలనా కాలంలోనికి వచ్చింది: "భూమిని శపించిన కరువు."

దృశ్యం మారిపోయి, దావీదు సింహాసనం మీద కూర్చున్నట్టు కన్పిస్తుంది. అతని ఎదుట పలువురు పురుషులు ఉన్నారు. సింహాసనం ప్రక్కనే బంగారు వెండి నాణ్యాలతో నింపబడిన పెట్టి ఉంచబడింది. ఆ మనుష్యులు గిబియోనీయులమని ప్రకటించుకున్నారు. "నేను మీకేమి చేయగోరుదురు?" అని దావీదు వారిని అడిగాడు. ఆ పెట్టెవైపు అతడు సైగచేసి, "యెహోవా స్వాస్థ్యమును మీరు దీవించునట్లు దోష నివృత్తికై దేనిచేత నేను ప్రాయశ్చిత్తము చేయుదును" అని దావీదు వారినడిగాడు (21:3).

ఆ మనుష్యులు వంగి యిలా ప్రత్యుత్తరమిచ్చారు: "సౌలును అతని యింటివారును చేసిన దాని నిమిత్తము ప్రాయశ్చిత్తము కలుగుటకై వెండి బంగారులే గాని ఇశ్రాయేలీయులలో ఎవనినైనను చంపుటయేగాని మేము కోరుటలేదనిరి." "రక్తానికి వారు రక్తం కోరుతున్నారు." దావీదు తన రాజనగరి కిటికీలోనుండి ఎండిపోయిన పొలాలు, బీటలు బారిన నేలను చూచాడు. చివరిగా, దావీదు "–మీరేమి కోరుదురో దానిని నేను మీకు చేయుదుననగా" (21:4).

ఆ మనుష్యులు తమ జవాబుతో సిద్ధంగా ఉన్నారు: "... మాకు హాని చేయ నుద్దేశించిన (సౌలు) వాని కుమారులలో ఏడుగురిని మాకు అప్పగించుము ... యెహోవా సన్నిధిని మేము వారిని ఉరి తీయించెదమని" రాజుతో మనవి చేయగా, విడుదలయు దుఃఖమును దావీదు ముఖంలో కన్పించాయి. మనం దాదాపుగా అతని మనస్సును చదువవచ్చు: "వారిలో వందలాది మంది చంపబడగా ఏడుగురు మాత్రమే మిగిలారు ... అయితే ఏడుగురిని నేను ఎలా మరణ శిక్షకు అప్పగించేది?" చివరికి రాజు తన తల ఆడించి, "... నేను వారిని అప్పగించెదననెను" (21:6).

ఆ మనుష్యులు వెళ్లిపోయారు. దావీదు తన సలహాదారులను పిలిచాడు.[6] ఆ ఏడుగురిని ఏరుకునే కార్యక్రమం ఆరంభమయ్యింది. ఇంకను జీవించియున్న సౌలు యొక్క కుమారుల పేర్లను సేకరించారు. మెఫీబోషెతు పేరు ప్రస్తావించబడినప్పుడు, "మెఫీబోషెతును ఆ జాబితాలోనుండి తొలగించండి," "చాల కాలం క్రిందట నేను అతని తండ్రికి మాట యిచ్చియున్నానని" రాజు అన్నాడు.[7] ఎక్కువ అవకాశాలు లేవు. సౌలు యొక్క సంతతి దాదాపుగా తుడిచివేయబడినట్టే.[8] సౌలు యొక్క ఉపపత్నియైన రిస్పా[9] యొక్క యిద్దరు కుమారులు, మేరబు[10] అను సౌలు యొక్క పెద్ద కుమార్తెకు అయిదుగురు కుమారులుండిరి.

దృశ్యం మారిపోయింది. ఎత్తయిన ఒక కొండమీద ఏడు స్తంభాలు, వాటిపై ఎండకు ఎదురుగా వ్రేలాడదీయబడిన ఏడుగురి మృతదేహాలు ఉన్నాయి. గోనెపట్ట ధరించి తన చెక్కిళ్లపై కన్నీటిధారలు కారే ఒక స్త్రీ కనిపిస్తుంది. మనం చూస్తూ ఉండగా, దృశ్యంలోని కొద్ది మార్పు సమయం గతించుతున్నట్టు సూచిస్తుంది. రాత్రి, పగలు, ఒక స్త్రీ ఆ దేహాల ప్రక్కనే నిలిచి, వాటిని తినటానికి వచ్చిన పక్షులను తరుముతూ, ఆ దేహాలమీద విందు

చేసికొనే జంతువులను తోలుతూ ఉంది.[11]

దృశ్యం సింహాసనమున్న గదికి మార్చబడింది. ఒక వర్తమానికుడు దావీదు వద్దకు వస్తాడు. "దేహాలను కాపాడుతూ రిస్పా యింకా అక్కడే ఉంది" అని అతడు చెప్పాడు. ఆ శవాలను తీసికొనిపోయి సౌలు యోనాతానులతో[12] పాటు సౌలు తండ్రియైన కీషు సమాధిలో పాతిపెట్టుడని ఆజ్ఞాపిస్తాడు.

దృశ్యం మిక్కిలి గొప్పదైన సమాధి వద్దకు మారుతుంది. జనుల గుంపు ఏడ్చుతున్నారు. దావీదు ఒంటరిగా నిలుచున్నాడు. అతడు నిశ్శబ్దంగా, దీర్ఘాలోచనలో తన తల వంచుకున్నాడు. ఆకాశం చీకట్లు కమ్ముతుంది, మేఘాలు అల్లుకుంటున్నాయి. ఆకాశంవైపుకు తల ఎత్తుచున్న దావీదు సమీపానికి కెమెరాను తిప్పారు.

తెరమీదనుండి దావీదు ముఖం వెళ్లిపోతుంది, అంతలో యిద్దరు కామెంటేటర్స్ తెరమీద కన్పిస్తారు. వారి క్రింద తెరపై ఇమా క్రిటిక్ –ఎత్తరి, సన్ననివాడు, బట్టతల కానుంది, చిరాకుగా కన్పించాడు. మరొకడు – యురా క్రిటిక్ – పొట్టి, గుండ్రని మనిషి అందంగా ఉన్నాడు.

ఇమా యిలా గొణుగుతున్నాడు. "ఈలాటి సంగతే దావీదుకు విరోధంగా నన్ను త్రిప్పేది! తాను ఎంతో గొప్పవాడైనట్టు నటన చేస్తూ అతడు యిక్కడ నిలిచి నిర్దోషులను చంపడానికి సమ్మతించాడు. ఇది గొప్ప ఓటమి!"

యూరా కోపగించుకొని యిలా అన్నాడు: "దావీదుతో నేను కూడా సుముఖంగా లేను. ఒకవేళ మనం అంత తొందరపడకూడదేమో. అతడు చేసింది యెహోవాకు యిష్టమైనట్టుగా ఉంది. గనుక యిక్కడ మనకు అర్థం కాని సంగతులు ఉండవచ్చు. ఇది సౌలు యింటిని యెహోవా నిరాకరించడంలో భాగమైయుండవచ్చు. చనిపోయిన మనుష్యులు నిర్దోషులు కాకపోవచ్చు. యెహోవా సెలవిచ్చిన దానిని జ్ఞాపకం ఉంచుకో: 'నరహంతకులగు అతని (సౌలు) యింటివారు' అని ఆయన అన్నాడు" (21:1).[13]

"అది కేవలం ఊహ" అని ఇమా అన్నాడు.

యూరా తన గడ్డం పైకిలేపి, "కావచ్చు, కాని, సందేహమనే లాభాన్ని నేను దావీదుకు యిస్తున్నా, బొటన వ్రేళ్లు పైకి" అని అన్నాడు.

లెక్కచేయు బోర్డుమీద ఒక బొటన వ్రేళ్లు క్రిందికి, ఒక బొటన వేళ్లు పైకి రికార్డు అయ్యింది.

## సైనికుడు (2 సమూ. 21:15–22; 1 దినవృ. 20:4–8)[14]

వివరించేవాడు తెరపైకి వచ్చాడు. "దావీదు సైనిక మేధావి. యుద్ధ భూమికి వెనుక వందల మైళ్ల దూరంలో తన సోపానంలో కూర్చుండే సైన్యాధిపతి ఏమీకాడు. తన బలగాలతో అతడు అక్కడే ఉంటాడు! ఇశ్రాయేలీయుల శాశ్వతమైన శత్రువగు ఫిలిష్తీయులతో దావీదు జ్ఞాపక చిహ్నములగు యుద్ధాల దృశ్యం యిదిగో ... గొల్యాతు అను శూరుని వద్దనుండి వస్తూనే ఉంది." "ఇప్పుడొచ్చే దృశ్యాలు సంక్షోభాన్ని, మరణాన్ని చిత్రిస్తాయి. వీక్షకులు వాటిలోని మంచి చెడ్డలను నిర్ణయించాలి" అని తెరమీద అక్షరాలు కనిపిస్తాయి.

మనం యుద్ధంలోనికి దూకాం. మొదటిలో చెమట పట్టిన శరీరాలు, తిరుగాడుతున్న ఆయుధాలు, రక్తపు మడుగుల్లో పడిపోయిన శవాల మధ్య మనం తికమకపడ్డాం. గోల, రంకెలు, కేకలు, అరుపులతో మారుమ్రోగిపోయింది. నెమ్మదిగా, యుద్ధాన్ని తిలకించాం. దావీదును, అతని మనుష్యులును ఫిలిష్తీయులతో యుద్ధం చేస్తున్నారు. ఫిలిష్తీయులలో బలశూరులున్నారు, ఇశ్రాయేలీయులలో అల్పుల మధ్య బ్రహ్మాండముగా కనబడుతున్నారు. దావీదును, అతని జనులును అడవి మనుష్యులవలె పోరాడుతున్నారు.

యుద్ధం కొనసాగేకొలది, దావీదు మెల్ల మెల్లగా తగ్గాడు. అతనికి కండ్లు తిరిగాయి, అతడు తన ఖడ్గాన్ని ఎత్తడానికి కష్టపడుతున్నాడు. ఒక బలశూరుడు దావీదు వంక చూచి అతని పరిస్థితిని గమనించి, అతని వైపునకు దూసుకొని పోయి, భయంకరమైన అతని ఖడ్గాన్ని తిప్పుతూ ఉన్నాడు. చివరి గడియల్లో దావీదు సైనికుల్లో ఒకడు రాజుకును ఆ బలశూరునికిని మధ్య దూసుకొని వచ్చి, శత్రువు యొక్క కడుపులో లోతుగా తన కత్తిని దించాడు. ఆ బలశూరుడు నేలను కూలినప్పుడు, మనం శ్వాసను విడిచాం.[15]

కెమెరా స్టూడియోకు కామెంటేటర్స్ వైపు మళ్లించింది. యూరా ఇమాను తేరి చూచాడు. “నీవు దాన్ని గూర్చి ఏమనుకుంటున్నావ్” అని అన్నాడు.

ఇమా గొణుగుతూ, “ఇది నా అభిరుచికి పూర్తిగా భిన్నమైనది, కాని దేశానికి శాంతిని చేకూర్చడానికి ఈలాటిది అవసరమని నాకు తోస్తుంది. ఇప్పుడది థమ్స్అప్ అనుకుంటాను.”

స్కోర్ బోర్డుకు థమ్స్ అప్ చేర్చబడింది.

### గాయకుడు (2 సమూ. 22:1–51)[16]

దృశ్యం రాజు యొక్క సింహాసనపు గదికి మార్చబడింది. దావీదు రాజవస్త్రాలు ధరించుకొని సితారా పట్టుకొని సింహాసనం మీద కూర్చున్నాడు. వ్యాఖ్యాత మాట్లాడుతున్నాడు: “తన జీవితంలో మరి దేనికంటెను మనం దావీదు యొక్క పాటలచే ప్రభావితం చేయబడ్డాం. మనకువలెనే దావీదుకు కూడా ఉల్లాస సమయాలు, క్రుంగిపోయిన సమయాలు లేకుండా పోలేదు. మనలో ఎక్కువ మంది వలెనే, తన మనోభావాలను పేపరు మీద పెట్టి, వాటన్నిటిని యెహోవాకు విన్నవించుకుంటుండేవాడు. యుద్ధ విజయంనుండి వచ్చి సరిక్రొత్తగా యెహోవాకు స్తుతులను పాడే దావీదు గానాన్ని విందాం.”

తన కండ్లు మూసికొని, స్పష్టమైన స్వరంతో దావీదు యిలా పాడసాగాడు:

> యెహోవా నా శైలము, నా కోట, నా రక్షకుడు.
> నా దుర్గము, నేను ఆయనను ఆశ్రయించుదును.
> నా కేడెము నా రక్షణశృంగము
> నా ఉన్నత దుర్గము నా ఆశ్రయస్థానము
> ఆయనే నాకు రక్షకుడు ...
> కీర్తనీయుడైన యెహోవాకు నేను మొఱ్ఱ పెట్టితిని
> నా శత్రువుల చేతిలోనుండి ఆయన నన్ను రక్షించెను (22:2–4).

కెమెరా దావీదుపై ఆడుతుంది. ఓ క్షణంపాటు అతని ముఖం కఠినమయ్యింది.

> నా శత్రువులను తరిమి నాశనము చేయుదును
> వారిని నశింపజేయువరకు నేను తిరుగను.
> ... జనులకు అధికారిగా నన్ను నిలిపితివి
> నేను ఎరుగని జనులు నన్ను సేవించెదరు (22:38, 44).

పాట ముగింపునకు వస్తూ ఉండగా అతని ముఖపు కాఠిన్యం తగ్గింది:

> అందువలన యెహోవా, అన్యజనులలో నేను నిన్ను ఘనపరచెదను
> నీ నామ కీర్తన గానముచేసెదను.
> నీవు నియమించిన రాజునకు గొప్ప రక్షణ కలుగజేయువాడవు
> అభిషేకించిన దావీదునకును అతని సంతానమునకును
> నిత్యము కనికరము చూపువాడవు (22:50, 51).

తెర కామెంటేటర్స్ వైపుకు తిరుగగా, యూరా మొదట మాట్లాడతాడు: "ఈ దృశ్యం[17] బత్షెబతో పాపం చేయక ముందు జరిగింది, తన సైనిక విజయాలకు తరువాతది అని నేను అంటాను. యెహోవా తనతో నిబంధన చేసిన తరువాత కూడా రాయబడి ఉండవచ్చు.[18] ఆ గీతం వ్రాయబడింది ఎప్పుడైనా, అది నన్ను తాకింది!"

ఇమా యిలా అన్నాడు: "తన శత్రువుల పతనం విషయంలో అతడు సంతసించడం నన్ను ఏమీ కదిలించలేదు."

"అయితే అది గొప్ప కీర్తనయే!"

"సరే, ... అది ఉత్తమమైన మంచి గీతం ... ఇష్టం అంతగాలేని థమ్స్ అప్."

స్కోరు బోర్డుమీద రెండు థమ్స్ అప్‌లు దాఖలు చేయబడగా యూరా చిరునవ్వు ధరించుతాడు.

**వివేకి (2 సమూ. 23:8-39)**[19]

నోట్లో ఎన్నో పళ్ళున్న ఒకడు, దమస్కు చెప్పుల జోళ్లు అమ్ముకునేవానిలా తెరమీద ప్రత్యక్షమౌతాడు. ఒక డ్రింక్ తీసుకొని మనం వచ్చేలోపల, వ్యాఖ్యాత యిలా అంటున్నాడు: "దావీదు పరిపాలన లోని చివరి పది సంవత్సరాల వైపుకు దృష్టిని మరల్చుదాం" అని అంటున్నాడు. తిరిగి దృశ్యం సింహాసనం గదివైపుకు మల్చబడింది. దావీదు రేగిన ఎర్ర జుట్టుమీద తెల్ల వెండ్రుకలు చిలుకరించబడినట్టున్నాయి. రాజ వస్త్రాలు కొద్దిగా బిర్రుగా ఉన్నాయి. వ్యాఖ్యాత యిలా అంటున్నాడు, "తన చివరి దినాల్లో దావీదు చేసిన ఒక పని ప్రత్యేకమైన వ్యక్తులపట్ల తన అభినందనను వ్యక్తపరచడం. అతడు సౌలు వద్దనుండి పారిపోయిన దినాల్లో తనతోనుండినవారు – తాను ఘనపరచినవారిలో ఉన్నారు."

దావీదు సింహాసనపు గదినుండి ప్రసార కేంద్రం ఒక విషయాన్ని తెలుపుతుంది. దావీదు రాజ్య సెక్రటరీని పిలుస్తాడు. అతడు కాగితం, కలం, ఇంకుతో వస్తాడు. దావీదు ఒక ఘనమైన పట్టీని సమర్పిస్తాడు, అది తన ముగ్గురు బలశూరులతో ఆరంభింప

బడుతుంది. ఎలియాజరు, దోదో కుమారుడు, ఆగే కుమారుడైన షమ్మా, అతడు గొప్ప విజయాలను తెచ్చిపెట్టినవాడు, యోషే బెష్షబెతను – ఇతడు యుద్ధములో 800 మందిని హతము చేసినవాడు.[20]

దావీదు కొంచెముసేపు ఆగి, లేఖికునికి యిలా ఆజ్ఞలు జారీ చేస్తున్నాడు: "యెహోవా ఇశ్రాయేలీయులకు గొప్ప రక్షణ కలుగజేసెనని" వ్రాయడానికి మరచిపోవద్దన్నాడు (23:12).

బేత్లెహేమునుండి తనకు నీళ్లుకొని తెచ్చిన ముగ్గురు శూరుల కథను దావీదు తెలిపాడు. వారి ధైర్యము నమ్మకత్వాన్ని జ్ఞాపకం చేసికొన్న అతని కన్నులు చెమ్మగిల్లాయి.

తరువాత దావీదు 30 మంది జాబితాను విడుదల చేశాడు. అందులో మొదటివాడు యోవాబు సహోదరుడైన అబీషై. ఒక యుద్ధంలో యితడు మూడు వందల మందిని హతము చేశాడు. ఇతడు ముప్పది మందిలో ఘనుడై వారికి అధిపతి ఆయెను. తరువాత వాడు బెనాయా. "దావీదు యితనిని తన సభికులలో ఒకనిగా చేసెను." మిగిలిన వారిని దావీదు పేర్కొన్నాడు. గతాన్ని జ్ఞాపకం చేసికొనేటప్పుడు ఆగడం జరిగింది: యోవాబు సహోదరుడైన ఆశాయేలు.[21] ... ఎల్హానాను ... షమ్మా ... ఎలీకా ..." కొంతసేపటికి దావీదు జాబితా అంతానికి వచ్చాడు. దావీదు చివరి పేరు ఉచ్చరిస్తాడు "హిత్తీయుడైన ఊరియా" అని.[22] పూర్ణంగా బాధతోనున్న దావీదు ముఖం మీద కెమెరా ఒక క్షణంసేపు నిలకడగా ఉంది. తెర వెళ్లిపోతుంది.

స్టుడియోలో, "ఎక్కువ బలాత్కారపు పొగడ్త" అని ఇమా సణుగుకున్నాడు!

"అయితే అది అవసరమే. దావీదు తన మనుష్యులకు అభినందనలు తెలియజేశాడు! ఇందులో శీలము, తెలివి ప్రదర్శింపబడింది."

ఇష్టం లేకుండగనే ఇమా అంగీకరించి, "నేను అలాగే అనుకుంటాను" అని అన్నాడు. "అంటే అది మరొక థమ్స్ అప్?"

కనబడక కనబడినట్టు ఇమా తల ఊపుతాడు.

రెండు థమ్స్ అప్‌లు బోర్డు లెక్కకు చేర్చబడ్డాయి.

**పాపి (2 సమూ. 24:1-25; 1 దినవృ. 21:1-22:1; 27:23, 24)[23]**

వివరించేవాడు తెరమీద కన్పిస్తాడు. "దావీదు యొక్క చివరి దినాలు విజయము విపత్తులతో మిళితమైయుంది. ఎన్నడూ మరువబడనిది రాజు జనాభా లెక్కలు తీసే అవమానకరమైన కాలం."

మనం తిరిగి సింహాసనం గదిని తిలకిస్తున్నాం. భీకరుడగు వృద్ధుడు[24] రాజు ఎదుట నిలిచియుంటాడు, మిలిటరి దుస్తులలో ఉన్న యితరులు అక్కడ నిలిచియుంటారు. దావీదు తలవెంట్రుకలు దాదాపు నెరసి ఉన్నాయి. అతడు మాట్లాడుతూ ఉంటే, అతని కంఠ స్వరము యింకను గంభీరంగాను బలీయంగాను ఉంది. "–జన సంఖ్య యెంతైనది నాకు తెలియగలందులకై దాను మొదలుకొని బెయెర్షెబావరకు ఇశ్రాయేలు గోత్రములలో నీవు సంచారము చేసి వారిని లెక్కించుమని" ఆజ్ఞాపించాడు [యుద్ధం చేసే వయస్కులు[25]] (2 సమూ. 24:2).

దృశ్యం మారుతుంది. దావీదు తన పడకమీద ఒక ప్రక్కకు కూర్చుండి, తన చేతిలోని

చుట్టను చదువుతున్నాడు. "ఇశ్రాయేలులో కత్తి దూయగల యోధులు 8,00,000 మరియు యూదాలో 5,00,000 మంది"[26] తను రాత్రి దీపాన్ని ఆర్పివేసి పడకమీద వాలతాడు. అతడు అటు యిటు పొర్లుతాడు. చివరికి, "–నేను చేసిన పనివలన గొప్ప పాపము కట్టుకొంటిని, నేను ఎంతో అవివేకినై దాని చేసితిని ..." (24:10)[27] అంటూ అతడు గుస గుసలాడతాడు.

ఇది మరునాటి ఉదయం. ఒక మనుష్యుడు తన పడక గదిలోనికి ప్రవేశించినప్పుడు, దావీదు తన పడక అంచున కూర్చుండియున్నాడు. అతన్ని చూడ దావీదు ఆశ్చర్యం నటించలేదు. అతడు యిలా మాట్లాడాడు:

> మూడేండ్లపాటు కరవు కలుగుట, మూడు నెలలపాటు నీ శత్రువులు కత్తిదూసి నిన్ను తరుమగా నీవు వారియెదుట నిలువలేక నశించిపోవుట, మూడు దినములపాటు దేశమందు యెహోవా కత్తి, అనగా తెగులు నిలుచుటచేత యెహోవా దూత ఇశ్రాయేలీయు దేశమందంతట నాశనము కలుగజేయుట, అను వీటిలో ఒకదానిని నీవు కోరుకొనుమని యెహోవా సెలవిచ్చుచున్నాడు; కావున నన్ను పంపినవానికి నేను ఏమి ప్రత్యుత్తరమియ్యవలెనో దాని యోచించుము (1 దినవృ. 21:11, 12).

దావీదు గదిలో అడుగులు వేస్తూ నిజంగా కలత చెంది ఉన్నాడు. కడకు అతడు యిలా అన్నాడు: "– నేను మిక్కిలి యిరుకులో చిక్కుకున్నాను; యెహోవా మహా కృపగలవాడు, నేను మనుష్యుల చేతిలో పడక ఆయన చేతిలోనే పడుదును గాక అని గాదుతో అనెను" (24:14).

తెరమీద సంక్షిప్తంగా కొన్ని అక్షరాలు కనిపిస్తాయి: "రానున్న దృశ్యాలను చూసేందుకు తలిదండ్రుల అనుమతి అవసరం." మనం ఒక చిన్న గ్రామంలోని ప్రధాన దారులకు కొనిరాబడ్డాము. జనం ఆ దారి వెంట హడావుడిగా తిరుగుతున్నారు. దుకాణదారులు అటుపోయే వాళ్ళను గట్టిగా పిలుస్తున్నారు. స్త్రీలు ఒకళ్ళతో ఒకళ్ళు కలిసి అక్కడి సరుకులను చూస్తుంటారు. పిల్లలు తల్లుల కాళ్ళు పట్టుకుని ఆడుతూ నడుస్తుంటారు.

దట్టమైన ఆకుపచ్చని మేఘం ఆకాశంలో హఠాత్తుగా ముంచుకు వచ్చినట్టు కన్పించిందట. ప్రజలు పైకి చూచినప్పుడు వారి ముఖాలలో భయం ఒరుసుకుంది. మేఘం పట్టణాన్ని కబళించుకుని వచ్చేసరికి మనుష్యులు తూలిపడుతున్నారు. తన కుటుంబంతో నడిచి వెళ్లుతున్న ఒకడు వీధుల్లోగుండా పరిగెత్తుతున్నాడు. పడిపోయిన మనిషి మీదికి కెమెరా వెళ్లింది. అతని ముఖంతో భయం కంపించింది. ఆ వీధి అంతా కేకలతో పెడబొబ్బలతో ప్రతిధ్వనిస్తుంది.

భీభత్సం కలిగిన ఇదే మరో గ్రామానికి దృశ్యం తరలింది. మనం భయపడి కండ్లు మూసికొన్నాం. మన కండ్లు చెమ్మగిలడం మనకు ఆశ్చర్యం కలిగిస్తుంది. "పాలస్తీనాకు ఉత్తర దిక్కున తెగులు ఆరంభమై త్వరలో దక్షణానికి వ్యాపించిందని" ప్రకటన విన్నాం. మనం తిరిగి తెరమీద చూచాం. తెగులు వ్యాప్తిని తెర చూపింది. "రాజధాని నగరుకు మరణం చేరడం ఆలస్యం కాదు" అని ప్రకటించేవాడు అన్నాడు. అంతలో బాణం యెరూషలేము దిశగా చూపింది. మనం రాజధాని నగరునకు మారాం.

దావీదును ఎక్కువ మంది ముసలివారు గోనెపట్ట ధరించుకొని, తమ తలలపై

బూడిదె వేసికుంటూ మందసమున్న యింటి ముఖ ద్వారమున మోకరించారు. ఒక వర్తమానికుడు పరుగెత్తుకొంటూ వచ్చి, "ఆ మేఘం దాదాపుగా యిక్కడికి వచ్చింది!" అని అన్నాడు. దావీదు ఉత్తర దిశగా చూచాడు. అతని కండ్లు బాగా తెరుచుకున్నాయి. వికారమైన ఆకుపచ్చ మేఘం ఉత్తర దిశ ఆకాశమంతా కమ్ముకుంది. గిరాట్లు కొడుతున్న నీటి తుంపరల్లో ఒక రూపం ఏర్పడింది: "దావీదు కన్నులెత్తి చూడగా, భూమ్యాకాశముల మధ్యను నిలుచుచు, వరదీసిన కత్తి చేత పట్టుకొని దానిని యెరూషలేము మీద చాపిన యెహోవా దూత కనబడెను" (1 దినవృ. 21:16)! దావీదు సాష్టాంగపడి, "జనులను ఎంచుమని ఆజ్ఞ ఇచ్చినవాడను నేనేగదా? పాపముచేసి చెడుతనము జరిగించిన వాడను నేనేగదా ... బాధపెట్టు నీ చెయ్యి నీ జనులమీద నుండకుండ నా మీదను నా తండ్రి యింటివారిమీదను ఉండనిమ్మని దేవునితో మనవిచేసెను" (1 దినవృ. 21:17; LB).

దేవుని వర్తమానికుడుగా యింతకు ముందు కన్పించిన మనిషి – "నీవు పోయి యెబూసీయుడైన అరౌనా యొక్క కళ్లములో యెహోవా నామమున ఒక బలిపీఠము కట్టించుమని"[29] దావీదుకు తెలియ జేస్తాడు (2 సమూ. 24:18).[30] తెరమీద యెరూషలేము పట్టణం కన్పిస్తుంది. బాణం దిశను చూపుతోంది. వివరించే వాడు యిలా అంటున్నాడు. "పట్టణపు ప్రాకారానికి ఉత్తరాన కళ్లం ఉంది." యెరూషలేము యొక్క గతి త్రాసులో ఊగిసలాడుతుంది. నిమిషాల్లో వేలకొలది మంది తుడిచి వేయబడతారు. రాజు ఆ స్థలానికి త్వరగా వచ్చాడు.

నలుగురు యువకుల సహాయంతో ఒక వృద్ధుడు దుమ్ముతోను, పొట్టుతోను చుట్టబడినవాడై చదునుగానున్న గుట్టమీద గోధుమలను నూర్చుకుంటున్నాడు.[31] కీడును ముందుగా సూచించే మేఘంవైపు తేరిచూచి, తన ఎడ్లు త్వరగా పని చేయాలని వాటిని తొందరపెట్టాడు.

దావీదును తనతో కూడ గోనెపట్ట కట్టుకున్న సమూహం తెరపై కన్పించారు. తన కళ్లం నూర్చుకునేవాడు రాజును కలిసికొని సాగిలపడి యిలా మనవి చేసికొన్నాడు: "నా యేలినవాడవును రాజునగు నీవు నీ దాసుడనైన నా యొద్దకు వచ్చిన నిమిత్తమేమని అడుగగా" (2 సమూ. 24:21ఎ). అందుకు దావీదు–"ఈ తెగులు మనుష్యులకు తగులకుండ నిలిచిపోవునట్లు యెహోవా నామమున ఒక బలిపీఠము కట్టించుటకై నీ యొద్ద ఈ కళ్లమును కొనవలెనని వచ్చితిని" అని అన్నాడు (2 సమూ. 24:21బి; 1 దినవృ. 21:22).

ఆ మనుష్యుడు తల ఎత్తి, దూసిన ఖడ్గం చేత పట్టుకొనియున్న దేవదూతను చూస్తాడు.[32] వణకుతున్న స్వరంతో అతడిలా అన్నాడు: "రాజా, ఇవన్నియు అరౌనా అను నేను రాజునకు ఇచ్చుచున్నాను ... యేది నీకు అనుకూలమో దాని తీసికొని బలి అర్పించుము" (2 సమూ. 24:22, 23). దావీదు తన తలను ఆడించి, "లేదు" "... వెల యియ్యక నేను తీసికొనిన దానిని నా దేవుడైన యెహోవాకు దహనబలిగా అర్పించను" అని అన్నాడు (2 సమూ. 24:24). బేరం కుదిరింది, డబ్బు చేతులు మారింది.[33]

దృశ్యం మారిపోతుంది. మట్టి రాళ్లతో కట్టబడిన బలిపీఠానికి యెదుట దావీదు మోకరించాడు. బలిపీఠంపైన, మంటల నడుమ కాలిపోయిన ఎద్దు శకలాలు మిగిలి

పోయాయి. వెంటనే పైనుండి వచ్చిన అగ్ని బలిని అలుముకొన్నది.[34] దావీదు పైకి చూస్తాడు. దేవదూత కత్తిని వరలో తిరిగి పెట్టాడు.[35] అంతర్ధానమయ్యాడు. మేఘాలు విచ్చిపోయి, వాటిలో గుండా సూర్యుడు ప్రకాశిస్తాడు. అప్పుడు వ్యాఖ్యాత స్వరం మనం వింటాం: "ఈ విధంగా భయంకరమైన తెగులు అంతమయ్యింది – కాని 70,000 మంది చావక ముందు కాదు! ఇశ్రాయేలు యొక్క చరిత్రలో యిదే మహా గొప్ప విపత్తు!"

కెమెరా తిరిగి మనలను స్టుడియోకు తీసికొనిపోయింది. తీవ్రమైన యూరా ఇలా మాట్లాడాడు: "యథార్థంగా, ఈ కథలో అనేక ఆశ్చర్యమైన విషయాలున్నాయి. దావీదు ఎందుకు జనాభా లెక్కలు తీయకోరాడు, అలా తీయడం ఎందుకు పాపమయ్యింది అనేదానితో ధర్మశాస్త్ర ఉపదేశకులు సహితం ఏకీభవించరు. పన్ను విధించాలనేది దావీదు మనస్సులో ఉందని కొందరంటారు ... లేక నిర్బంధంగా సైన్యంలో మనుష్యులను చేర్చుకోవాలని ఉందని ... నిర్మాణ కార్యక్రమంలో బలవంతపు పని చేయించుకో గోరినట్టు కొందరంటారు."[36]

ఇమా ఊపిరి బిగపట్టి ఒక ఆవిలింత తీస్తాడు. "ఎక్కడికి లెక్క? దావీదు ఒక పెద్ద పాపం చేశాడు, 70,000 ప్రజలు చచ్చారు!"

దానికి యూరా దిగ్భ్రమచెంది చూచాడు. "అయితే దేవుడు అతనిని క్షమించాడు. నీవెందుకు క్షమించకూడదు?"

ఇమా మొండిగా చూచాడు. "కొన్ని ఆవులను సంహరించి దుప్పటి కింద 70,000 మంది మరణాలను పూడ్చలేవు. థమ్స్ డౌన్!" అని అన్నాడు.

## చావక బ్రదికినవాడు (1 దినవృ. 22:1–27:34)[37]

కెమెరా వ్యాఖ్యాత వైపుకు మళ్లుతుంది. "అరౌనా కళ్లం వద్ద దేవుని కృప యొక్క మహత్తరమైన ప్రత్యక్షతను దావీదు తిలకించాడు – దేవుని యింటి ఛాయా ఉద్దేశం: దేవునితో సమాధానపరచుకొనే స్థలంగా అతడు చూచాడు. రాజుతో దేవుడు మాట్లాడాడు. దేవాలయం కట్టవలసిన స్థలం యిదేనని ఆయన సూచించాడు."

తెర మనలను అరౌనా కళ్లము వద్దకు తోడుకొని పోతుంది. దావీదు తన కాళ్లమీద నిలిచి, ఉద్వేగపూరితమైన గళంతో, "దేవుడైన యెహోవా నివాసస్థలము ఇదే" బలి జరిగిన స్థలాన్ని అతడు సూచిస్తూ, "ఇశ్రాయేలీయులర్పించు దహనబలులకు పీఠము ఇదే" (1 దినవృ. 22:1).

ఒక దృశ్యం వెంట దృశ్యంలో దావీదు సమకూర్చిన వస్తువులు ప్రదర్శింపబడ్డాయి: బంగారు, వెండి, యినుము, ఇత్తడి; దేవదారు మానులు "లెక్కకు విస్తారమైనవి" గొప్ప రాతి బండలు – కన్పించాయి. వివరించేవాని స్వరం యిలాగంది. "మందసంకొరకు స్థిరమైన యింటిని కట్టనియ్యకుండడం దావీదుకు కలిగిన గొప్ప నిరాశలలో ఒకటి. ఆ కల దావీదు హృదయంలో యింకా మండుతునే ఉంది. దావీదు జీవితం యొక్క చివరి పది సంవత్సరాలు మహా గొప్పదైన దేవాలయ నిర్మాణం కొరకు సిద్ధపరచడానికే సమర్పించబడినట్టుంది."

దృశ్యం సామాగ్రి గదిలోనికి మారుతుంది. ప్రశస్తమైన లోహాలకు సమీపంగా దావీదు

నిలిచియున్నాడు. అతని ప్రక్కనే నవ యువకుడు రాజ వస్త్రాలు ధరించి కన్పించాడు. వారిరువురి ముందు పలువురు నిలిచియున్నారు. వివరించేవాడు యిలా మాట్లాడుతున్నాడు. "దావీదు తన కలను తన కుమారుడైన సొలొమోనుతోను, ఆ దేశపు ప్రముఖులతోను పంచుకున్నాడు." దావీదు తన చెయ్యిని ఆ యువకుని భుజముల మీద పెట్టి అక్కడ మాట్లాడడానికి ఆరంభించాడు:

> నా కుమారుడా, నేను నా దేవుడైన యెహోవా నామఘనతకొరకు ఒక మందిరమును కట్టించవలెనని నా హృదయమందు నిశ్చయము చేసికొనియుండగా యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను – నీవు విస్తారముగా రక్తము ఒలికించి గొప్ప యుద్ధములు జరిగించినవాడవు, నీవు నా నామమునకు మందిరమును కట్టించకూడదు, నా సన్నిధిని నీవు విస్తారముగా రక్తము నేలమీదికి ఒడ్చితివి. నీకు పుట్టబోవు ఒక కుమారుడు సమాధానకర్తగా నుండును; ... అతనికి సొలొమోను అను పేరు పెట్టబడును; ... అతడు నా నామమునకు ఒక మందిరమును కట్టించును ... (1 దినవృ. 22:7–10).

దృశ్యం సింహాసనపు గదికి మార్చబడుతుంది. దావీదు తన సింహాసనం మీద ఆసీనుడైయున్నాడు దావీదు సింహాసనానికి కుడివైపున మరో సింహాసనం వేయబడియుంది. రాజు ఎదుట సొలొమోను నిలిచియున్నాడు. కొందరు యాజకులతో పాటు, యితరులు కూడా ఉన్నారు. విషయాన్ని వివరించేవాడు యిలా అంటున్నాడు: "దావీదు వృద్ధుడు కాగా, తన తరువాత రాజుగా అతడు సొలొమోనును అభిషేకించాడు."[38] బహిరంగం కాని కర్మ కలాపమందు మోకరించేలా దావీదు సొలొమోనును కదిలిస్తాడు. యాజకుడు ఆ యువకుని తలపై నూనెపోస్తాడు. సొలొమోను తన తండ్రి ప్రక్కన సింహాసనం మీద ఆసీనుడౌతాడు.

"అప్పటినుండి సొలొమోను దేవాలయపు ప్లానులోను సిద్ధపాటులోను పని కలిగియుంటాడు. దేవాలయపు సేవకును దాని పోషణకును సక్రమ రీతిగానుండు సంస్థ కావలసి వచ్చింది." దావీదు సొలొమోనులు ఒకరి ప్రక్కన ఒకరు ప్రదర్శింపబడ్డారు – డాక్యుమెంట్సును తనికీ చేస్తున్నట్టున్నారు.

మనం స్టుడియోకు తిరిగి రాగా ఇమా యూరాతో మాట్లాడుతున్నాడు: "నాకు చెప్పవద్దు నాకు చెప్పవద్దు! దేవుడు 'వద్దు' అన్నాడు గనుక అతడు విడిచిపోనందుకు శిక్షింపబడాలి. నేను థమ్స్ అప్‌తో కూడా ప్రక్కగా వెళ్లతా. నాకైతే, వారు ఎలాటిదై యుంటుందని అంటున్నారో దానిలో సగమైనా ఉంటుందాయని నేను తెలిసికోవాలని ఆసక్తిగా ఉన్నా!"

## వారసత్వం (1 రాజులు 1:1–53; 1 దినవృ. 28:1–29:25)[39]

గతంలో చెప్పుల జోళ్లు అమ్ముకున్నట్టు కన్పించినవాడు తిరిగి తెరమీదికి వచ్చాడు. అతడు యిలా అన్నాడు: "అరౌనా కళ్లం సమీప ప్రాంతంలో కట్టడానికి పనికి వచ్చే రాళ్లు యింకా లభ్యమౌతాయి. త్వరలో కట్టబోవు దేవాలయపు దృష్టితో ఒక సొంత యిల్లు కట్టుకొనడానికి కూడా యిదియే తరుణం!" అతడు అలా అంటూ ఉండగా

సింహాసనపు గదినుండి వెలుపలికి వచ్చాం.

మనం తిరిగి వచ్చినప్పుడు, వ్యాఖ్యాత యిలా అంటున్నాడు: "మనము యిప్పుడు రాజు చివరి దినాలకు వచ్చాం. అతని ఆరోగ్యం తగ్గిపోనారంభించింది. అయితే అతని విశ్వాసం బలీయంగా నిలిచియుంది." దావీదు కీర్తనలలో ఒక దానిలోనుండి మాటలు తెరపైకి వచ్చాయి: "నేను చిన్నవాడనై యుంటిని ఇప్పుడు ముసలివాడనై యున్నాను అయినను నీతిమంతులు విడువబడుట గాని వారి సంతానము భిక్షమెత్తుట గాని నేను చూచియుండలేదు" (కీర్తన. 37:25).

రాజు పడక గదిని మనకు చూపుతున్నారు. దావీదు తన పడకపై వాలిపోయి, ముసలితనంచేత క్షీణించిన దేహంతో ఉన్నట్టు కన్పించాడు. సంగతులను చెప్పేవాడు యిలా అన్నాడు: "రాజు తన అంతానికి చేరుకున్నప్పుడు, అతడు రోగియై బలహీనుడై చలిచేత బహుగా వణకిపోతున్నాడు. రాజు అంతఃపురానికి షునేమీయురాలైన[40] అబీషగు అను సుందరవతి రాజుకు పరిచర్య చేయడానికి చేరింది.[41] రాజుకు వెట్టకలిగించ డానికి"[42] ఆయన పడక గదిలోనికి ఆమె వచ్చింది. ఆమె రాజుకు భోజనం పెట్టుతూ ఉండగా సంగతి తెలిపేవాడు యిలా చెప్పాడు: "రాజ్య సంబంధమైన సమస్త కార్యాలు దావీదు దాదాపుగా అన్నీ సొలొమోనుకు అప్పగించాడు. అభీషగు అను సుందరవతి సహవాసంలో రాజు తన చివరి దినాలు గడపనున్నాడు. కాని అది అలా ఉండబోవడం లేదు."

రాజనగరు వీధిలో తన రథంమీద వెళ్లుతున్న ముప్పై ఏండ్ల ఈడుగల ఒక అందమైన మనిషి మీదికి దృశ్యం మల్చబడింది. డజన్ల కొలది బలిష్టులైన యువకులు ఆ రథం వెంట వెళ్లుతున్నారు. "దావీదు యికను జీవించబోవడం లేదని గోచరమౌతున్నప్పుడు, అతని కుమారుడైన అదోనీయా సింహాసనమెక్క ప్రయత్నించాడు. తన కోరికగా దావీదు అంతకు ముందే సొలొమోనును సూచించాడు.[43] అయితే అదోనీయాకు అది పెద్ద పట్టింపుగా లేదు. జీవించినవారిలో అతడు పెద్ద కుమారుడు[44] గనుక తాను రాజవ్వా లనేది[45] అతని ఆలోచన."

అదోనీయా యిద్దరు మనుష్యులతో సంప్రదింపులు చేశాడు. వారిలో ఒకడు గతంలో మనం చూచిన భయంకరమైన యుద్ధ శూరుడు. రెండవవాడు యాజక వస్త్రాలు ధరించినవాడు. విషయాన్ని వివరించేవాడు మాట్లాడుతున్నాడు: "అదోనీయా దేశంలో చాలా ప్రసిద్ధిని కలిగిన ఇద్దరు మనుష్యులను తన పక్షంగా చేర్చుకున్నాడు: సైన్యాధిపతియైన యోవాబు, మరియు ప్రధానయాజకుడైన అబ్యాతారు[46] అతని పక్షాన ఉన్నారు. సమయాన్ని అదోనీయా సరిగ్గా కనిపెట్టి, ఏన్‌రోగేలు సమీపమందుండు జోహెలేతు అను బండ దగ్గర[48] కిద్రోను లోయలో తనకు ప్రోత్సాహాన్ని యిచ్చేవారికి గొప్ప విందు చేశాడు."

దృశ్యం పారుతున్న వాగు ప్రక్కన ఉన్న పచ్చటి లోయ సమీపానికి మారుతుంది. యెరూషలేము గోడలు బ్రహ్మాండంగా అక్కడికి కన్పిస్తాయి. విస్తారంగా, పొడుగ్గా ఉన్న భోజనం బల్లలు చుట్టు కూర్చున్న జనులు నవ్వుకుంటూ భోజనం చేస్తున్నారు. అదోనీయాయు యాజకుని దుస్తులలో ఉన్న ఒకడును ఎత్తయిన స్థలానికి వెళ్ళారు. "అదోనీయా చిరంజీవియగును గాక" అంటూ చేరిన ప్రజలందరు చప్పట్లుకొట్టారు (1 రాజులు 1:25).

అక్కడనుండి తెర రాజ నగరులోని గదిలోనికి మార్చబడింది. నలభై ఏండ్ల ప్రాయంలో ఉన్న ఒక స్త్రీతో మోటైన వస్త్రాలు ధరించిన ఒక పురుషుడు మాట్లాడుతున్నాడు. వివరణ యిచ్చేవాని స్వరం యిలా అంటుంది: "జరిగిన సంగతి ప్రవక్తయైన నాతాను వినినప్పుడు, సొలొమోను తల్లియైన బత్షెబ యొద్దకు వచ్చాడు. వారిద్దరు కలిసి రాజు సముఖానికి వచ్చారు."

దావీదు పడక గదిని మనం చూస్తాం. పడక మీద ఉన్న రాజు వింటుండగా అబీషగు కాగితపు చుట్టను చదువుతోంది. బత్షెబ గదిలోనికి ప్రవేశించి, నమస్కరించి, జరిగిన దానిని రాజునకు తెలిపింది.[49] తన సమాచారానికి మద్దతుగా నాతాను లోనికి ప్రవేశించాడు. అప్పుడు రాజైన దావీదు – "యాజకుడైన సాదోకును ... యెహోయాదా కుమారుడైన బెనయాను నా యొద్దకు పిలువుమని" సెలవిచ్చాడు (1 రాజులు 1:32). మరో యిద్దరు అతని గదిలోనికి ప్రవేశించారు. స్థిరమైన స్వరంతో దావీదు యిలా తెలియజేశాడు:

> మీరు మీ యేలినవాడనైన నా సేవకులను పిలుచుకొని పోయి నా కుమారుడైన సొలొమోనును నా కంచరగాడిదమీద ఎక్కించి గిహోనునకు తీసికొనిపోయి యాజకుడైన సాదోకును ప్రవక్తయైన నాతానును అక్కడ ఇశ్రాయేలీయులమీద రాజుగా అతనికి పట్టాభిషేకము చేసిన తరువాత మీరు బాకానాదము చేసి – రాజైన సొలొమోను చిరంజీవియగును గాక అని ప్రకటన చేయవలెను (1 రాజులు 1:33, 34).

వీధులలోనుంచి సొలొమోను దావీదు వాహనం ఎక్కి వెళ్లుతున్నట్టు మనం చూస్తాం. రాజుకు సంబంధించిన ఈ జనం పట్టణం దాటి వెళ్లుతుండగా ఉత్సాహం అధికమౌతుంది. త్వరలోనే పట్టణమంతా తూర్పు ద్వారమువద్దకు తరలివచ్చింది.

పట్టణ ప్రాకారానికి వెలుపల ఎత్తయిన స్థలంలో సొలొమోను నిలిచాడు. తాను మోకరించాడు కొమ్ములోనుండి నూనె అతని తలమీద పోయబడింది. బూర ఊదబడింది. "రాజైన సొలొమోను చిరంజీవియగును గాక" అనే ధ్వనులు మోగాయి (1 రాజులు 1:39). శబ్దం చాలా పెరిగింది. కొందరు వాయిద్యాలు వాయించుతూ నాట్యమాడు తున్నారు; ఉల్లాస నాదం అంతకంతకు ఎక్కువైయింది.

కథకుడు మళ్ళీ తెరపైకి వచ్చాడు. "ఉల్లాసంతో సాగే ఆ ధ్వని ఎంత పెద్దగా ఉందంటే దక్షణంగా అరమైలు దూరంలో ఉన్న అదోనీయా ఉత్సవానికి వినిపిస్తోంది. అతని మద్దతుదారుల ఆకలి ఎగిరిపోయింది, వారు పారిపోయారు. అదోనీయాయు, యోవాబును అబ్యాతారును ... వాళ్ళతో పాటు ఒక టన్ను ఆహార పదార్థాలు మిగిలి పోయాయి. వారి కడుపుల్లో భయం మిగిలిపోయింది.[50] అదోనీయా యొక్క తిరుగుబాటు ఎంత త్వరగా ఆరంభమయ్యిందో అంత త్వరగా అది అంతమయ్యింది. ఇశ్రాయేలీయులకు క్రొత్త రాజు నియమింపబడ్డాడు. సొలొమోను సింహాసం మీద ఆసీనుడైయున్నాడు."[51]

మరల దృశ్యం మారినప్పుడు, దావీదు రాజనగరు బాల్కనీలో నిలిచి ఉన్నాడు. చిక్కిపోయిన అతని దేహం మీద రాజ వస్త్రాలు లూజుగా వ్రేలాడుతున్నాయి. పెద్ద గుంపు కింద నిలిచింది. వ్యాఖ్యాత యిలా అంటున్నాడు: "యెహోవా వద్దనుండి బలము

పొందినవాడై, దావీదు తన రోగశయ్యనుండి లేచి కొత్త రాజును బలపరచుతూ, దేవాలయాన్ని నిర్మించండి అని ప్రజలకు ఆజ్ఞాపించాడు." నిశ్శబ్దంగా ఉండమనడానికి దావీదు తన సన్నని చేతిని పైకి ఎత్తాడు. బలహీనమైన, స్థిరమైన గళంతో అతడు యిలా మాట్లాడాడు:

> నా సహోదరులారా, నా జనులారా, నా మాట ఆలకించుడి; ... యెహోవా నాకు అనేకమంది కుమారులను దయచేసియున్నాడు, అయితే ఇశ్రాయేలీయులపైని యెహోవా రాజ్యసింహాసనముమీద కూర్చుండుటకు ఆయన నా కుమారులందరిలో సొలొమోనును కోరుకొని ఆయన నాతో ఈలాగు సెలవిచ్చెను – నేను నీ కుమారుడైన సొలొమోనును నాకు కుమారునిగా ఏర్పరచుకొనియున్నాను, నేను అతనికి తండ్రినైయుందును అతడు నా మందిరమును నా ఆవరణములను కట్టించును. కాబట్టి మీరు ఈ మంచి దేశమును స్వాస్థ్యముగా అనుభవించి, మీ తరువాత మీ సంతతివారికి శాశ్వత స్వాస్థ్యముగా దానిని అప్పగించునట్లు మీ దేవుడైన యెహోవా మీకిచ్చిన యాజ్ఞలన్నియు ఎట్టివో తెలిసికొని వాటిని గైకొనుడి అని యెహోవా సమాజమునకు చేరిన ఇశ్రాయేలీయులందరు చూచుచుండగను మన దేవుడు ఆలకించుచుండగను నేను మిమ్మును హెచ్చరిక చేయుచున్నాను (1 దినవృ. 28:2–8).

దావీదు తన ఉపన్యాసాన్ని కొనసాగిస్తుండగా, విషయం చెప్పేవాని స్వరం వినిపిస్తుంది: "దావీదు సొలొమోనుకు ఆజ్ఞ యిచ్చి, దేవాలయ నిర్మాణ కార్యక్రమాన్ని అధికార పూర్వకంగా అతనికి అప్పగించాడు. సొలొమోనును బలపరచడానికిని, దేవాలయ నిర్మాణానికిని సొలొమోనుతో అండగా నిలవాలని దావీదు కోరాడు. మరియు బలులు అర్పింపబడడానికిని, విందుకును అదేశాలు జారీచేశాడు. ఇశ్రాయేలీయుల చరిత్రలోని సహా దినాల్లో అది ఒకటి – దావీదు బహిరంగంగా కన్పించిన కడసారి అది."[52]

కెమెరా తిరిగి స్టుడియోకు తీసికొని వెళ్లుతుంది. అక్కడ మనస్సున కోపంగల ఇమా విశాల ఆకాశంలోకి చూస్తాడు, జయముపొందిన యూరా తన రెండు బొటన వ్రేళ్లను పైకి ఎత్తుతాడు.

## సైగ చేయడం (2 సమూ. 23:1–7; 1 రాజులు 2:1–9)

దావీదు పడక గదికి తిరిగి వచ్చాం. సొలొమోను తండ్రి పడక ప్రక్కనే మోకరించి యున్నాడు. కథకుడు యిలా అన్నాడు: "దావీదు చివరిసారిగా దర్శనమిచ్చిన తరువాత, అతని పరిస్థితి త్వరగా క్షీణించింది. తన అంతం సమీపించినప్పుడు, అతడు సొలొమోనును తన ప్రక్కకు పిలుచుకున్నాడు. తన స్నేహితులైన వారిని మరచిపోవద్దని అతడు తన కుమారుని ఆజ్ఞాపించాడు.[53] తన పరిపాలనను నిర్లక్ష్యపెట్టే పలుకుబడిగలవారి విషయమై జాగ్రత్తగా ఉండమని అతడు సొలొమోనును హెచ్చరించాడు.[54] అన్నిటికంటె ముఖ్యంగా దేవునికి నమ్మకంగా ఉండుమని దావీదు సొలొమోనుకు హితవు పలికాడు." దావీదు తన చెయ్యి ఎత్తుకొని సొలొమోనుపై ఉంచి, యిలా అనడం మనం గమనిస్తాం:

> –లోకులందరు పోవలసిన మార్గమున నేను పోవుచున్నాను; కాబట్టి నీవు ధైర్యము తెచ్చుకొని నిబ్బరము గలిగి నీ దేవుడైన యెహోవా అప్పగించిన దానిని కాపాడి, ఆయన మార్గముల ననుసరించిన యెడల నీవు ఏ పని పూనుకొనినను ఎక్కడ తిరిగినను

> అన్నిటిలో వివేకముగా నడుచుకొందువు. మోషే ధర్మశాస్త్రములో వ్రాయబడియున్న దేవుని కట్టడలను ఆయన నియమించిన ధర్మమంతటిని ఆయన న్యాయ విధులను శాసనములను గైకొనుము (1 రాజులు 2:2, 3).[55]

దావీదు తన కన్నులను ఆకాశము తట్టు ఎత్తి నెమ్మదిగా యిలా పాడసాగాడు.[56]

> ఇశ్రాయేలీయుల దేవుడు సెలవిచ్చుచున్నాడు ...
> –మనుష్యులను ఏలు నొకడు పుట్టును
> అతడు నీతిమంతుడై దేవునియందు భయభక్తులు గలిగియేలును.
> ఉదయకాలపు సూర్యోదయ కాంతివలెను ... అతడు ఉండును.
> నా సంతతివారు దేవుని దృష్టికి అనుకూలులే గదా ...
> ఆయన నాతో నిత్యనిబంధన చేసియున్నాడు ...
> (2 సమూ. 23:3–5).

దావీదు కండ్లు మూశాడు. సొలొమోను తన తండ్రిని కౌగలించుకున్నాడు. ఆ దృశ్యం నెమ్మదిగా తేలిపోతుండగా, వివరించేవాడు యిలా అన్నాడు. "ఇది జరిగిన కొద్ది సేపటికి దావీదు ఈ జీవితంనుండి మెల్లగా జారిపోయాడు. దావీదు రాజు నలభై యేండ్ల పరిపాలనా కాలం అంతమయ్యింది. భూమిమీద అతని డెబ్బది ఏండ్లు పూర్తయ్యాయ్. ఇశ్రాయేలు మధుర గాయకుడు చనిపోయాడు."

కన్నీటి బిందువులను తుడుచుకుంటూ ఉండగా, స్టుడియోకి మరలి చలించాం. ఇమా కోపంతో తన పిడికిలిని ఆడించాడు. "సున్నం కొట్టే పనిని గురించి మాట్లాడు! యోవాబును షిమీను తొలిగించమని దావీదు సొలొమోనుకు చెప్పాడని నేను ఎరుగుదును! అయిపోయింది!"

యూరా అభ్యంతరం తెలియజేస్తాడు. "సరే, యోవాబు అదోనీయా కుట్రలో పాలివాడయ్యాడు."

"కావచ్చు, అయితే షిమీ సంగతి ఏమి? తన్ను చంపనని దావీదు షిమీకి మాట యిచ్చాడు."

"అది ... సరే! ... దావీదు అతనికి మరొక తరుణం యిచ్చిన తరువాత కూడా, అతడు దావీదు పరిపాలనను అలక్ష్యం చేసియుండవచ్చు."[57]

ఇమా నిట్టూర్పు విడిచాడు. "నీవు నేడు ఒకవేళ అనేవాటితో నిండావు! వాస్తవాలను ఆధారం చేసికొని ఈ బొటనవ్రేలు క్రిందికి వెళ్లుతుంది."

యూరా స్కోర్ బోర్డువైపు చూస్తాడు. "సరి, కాని నీవు మొత్తాన్ని లెక్కించినప్పుడు థమ్స్ డౌన్‌కంటె థమ్స్ అప్ ఎక్కువగా ఉన్నాయి."

ఇమా కోపంతో అరుస్తూ, "మొత్తాలు ఎంతైతే ఎవడికి లెక్క? ముఖ్య సమాచారాల్లో నిలిచినవాడితడే, ఎంతో గొప్పగా ఉండవలసినవాడు! ఎందుకు, తన సొంత సమాధుల దొడ్డికి సరిపోయినన్ని అస్థిపంజరాలు అతని గదిలోనే ఉన్నాయి!"

యూరా తిరిగి దెబ్బకొడతాడు. "అందుకని, అతడు పరిపూర్ణుడు కాడు! నీవు పరిపూర్ణుడవని తలంచుకొంటున్నావా?"

ఇమా చమత్కారంగా జవాబిస్తాడు. "సరి, దావీదువంటివాడైతే అలాగుండాలని నేను నిశ్చయంగా భావిస్తాను. వాస్తవానికి, ..."

ఇమా ఏమి చెప్పబోతున్నాడో మనం ఎన్నడూ తెలిసికోలేం. ఎందుకంటె, వెంటనే బహు కాంతివంతమైన వెలుగు స్టుడియోను నింపింది. మరియు మన ఆత్మలలోగుండా దూసికొనిపోయే ఒక స్వరం యిలా పలికింది: "ఇమా, యూరా, కూర్చుని నిశ్శబ్దంగా ఉండండి. మీలో ఏ ఒక్కడు రైటు కాదు. మీలో ఒకడు దావీదు పక్షంగా వాదించడానికి ఉన్నాడు, మరొకడు అతనికి తీర్పు తీర్చడానికి ఉన్నాడు. మీలో ఎవడును నేను చూచినట్టు చూడలేడు, ఎందుకంటె, అన్నిటికంటె ముఖ్యంగా నేను హృదయాన్ని చూస్తాను. దావీదు నా హృదయానుసారుడు!" ఇమా క్రిటిక్, యూరా క్రిటిక్ అనేవారిని మనం కడసారి చూచినప్పుడు, వారు ఆకాశం వైపు తేరిచూస్తూ, నోళ్లు తెరుచుకొని స్తంభించిపోయారు. అప్పుడు టి.వి. సెట్ పగిలిపోయింది.

## దావీదుపై దేవుని తుదిపలుకు

చివరి దృశ్యంలో నేను ఎక్కువ జోక్యం కలిగించుకున్నట్టుంది. అయితే ఒక విషయాన్ని స్పష్టపరచాలని కోరాను: దావీదు మీద చివరి మాట మనం యివ్వకూడదు. మన శీర్షిక క్రమాన్ని ముగించేటప్పుడు, దావీదు జీవితాన్ని దేవుడు ఎలా విలువకట్టాడో కొద్ది క్షణాలు తిరిగి ఆలోచన చేద్దాం.

సౌలును దేవుడు రాజుగా ఉండకుండ నిరాకరించినప్పుడు, సౌలు దావీదును గూర్చి చేసిన ప్రతిపాదన దగ్గరకు వెళ్లి ఆరంభిద్దాం: "అయితే నీ రాజ్యము నిలువదు. యెహోవా **తన చిత్తానుసారమైన మనస్సుగల** యొకని కనుగొనియున్నాడు. నీకు ఆజ్ఞాపించినదానిని నీవు గైకొనకపోతివి గనుక యెహోవా తన జనులమీద అతనిని అధిపతినిగా నియమించును" (1 సమూ. 13:14; నొక్కి పలకడం నాది).

తరువాత రాజును అభిషేకించడానికి సమూయేలు బేత్లెహేములోని యెష్షయి యింటికి వెళ్లగా, ఎత్తరి బలిష్టులై ఉన్న యెష్షయి పెద్ద కుమారులను న్యాయాధిపతి తిలకించినప్పుడు, వారిలో ఒకడు రాజైయుంటాడని తలంచాడు. నేను అతనిని నిరాకరించాను కనుక, "–అతని రూపమును అతని యెత్తును లక్ష్యపెట్టకుము, మనుష్యులు లక్ష్యపెట్టువాటిని యెహోవా లక్ష్యపెట్టడు; నేను అతని త్రోసివేసియున్నాను. మనుష్యులు పైరూపమును లక్ష్యపెట్టుదురుగాని **యెహోవా హృదయమును లక్ష్య పెట్టును**" (1 సమూ. 16:7; నొక్కి పలకడం నాది).

మన శీర్షిక వరుస క్రమంలో, దావీదు యొక్క మంచి దినాల్లో మనం అతనితో పరుగెత్తాం; అతని చెడ్డ దినాల్లో అతనితో కూడా ప్రాకుతూ పోయాం. మనం అలా చేసినప్పుడు, "మనుష్యులు పై రూపాన్ని లక్ష్యపెట్టుదురనే" దేవుని ఆరోపణ విషయంలో నేను దోషినని ఒప్పుకోవలసియుంది. కృపాసనము మీదకంటె మనలో ఎక్కువ మంది తీర్పు సింహాసనం మీద సౌకర్యంగా ఉంటామని చెప్పబడింది – అది నిజమే. దావీదు జీవితాన్ని చదివేటప్పుడు, రెండు సంగతులు మరచిపోవడం సులభం: (1) మనం అసలు

దావీదు విషయం న్యాయం చెప్పితే, అది అతడు జీవించిన కాలం యొక్క పరిస్థితులను బట్టియే చేయాలి గాని క్రొత్త నిబంధన ప్రమాణాలతో కాదు. (2) దావీదు యొక్క ఔనత్య పతనాలన్నిటిలోగుండ దేవునికి అత్యధికమైన అక్కర కలిగియున్నది, అతని హృదయమే ఈ వరుసలో మొదటి పాఠమందు నేను సూచించిన కొన్ని సంగతులను యిక్కడ గుర్తించుదాం:

> దావీదు జీవితాన్ని గూర్చిన అధ్యాయాలు అతని హృదయాన్ని కేంద్రీకరించి మాట్లాడి నంతగా అతని చరిత్రను గూర్చి మాట్లాడలేదు.
>
> ... దావీదు మ్యూజియంలోని చలువరాతి సెయింట్ కాదు. వేడి రక్తం అతని నాళాలలో ప్రవహించింది, తీవ్ర వాంఛలు అతని శరీరంలో ప్రబలాయి. అనేకులు ఎగురలేనంత ఎత్తుకు ఎగిరాడు, భయంకరంగాను పడిపోయాడు కూడా.
>
> ... అతని అతి శ్రేష్ఠతలో గాని, మిక్కిలి హీనతలో గాని అతని భక్తి విశ్వాసము ఎల్లవేళలా దేవునియందే ఉంది. జీవిత తుఫానులవలన దావీదు ఆత్మ దిక్సూచి తరచుగా అల్లాడినా, ఆ ఆపద దాటిపోయిన తరువాత, – తన దేవుని వైపునకే ఆత్మసంబంధమైన ధృవమువైపునకే అతని దిక్సూచి చూపుతూ వచ్చింది.[58]

దావీదు మరణానంత కాలానికి నాతోపాటురా. 1 రాజులు 3లో దేవుడు సొలొమోనుకు కలలో కనిపించాడు. అతని కోరికలనన్నింటిని తీర్చగలనన్నాడు. 14వ వచనాన్ని పరికించు: "మరియు నీ తండ్రియైన దావీదు నా మార్గములలో నడిచి నా కట్టడలను నేను నియమించిన ధర్మమంతటిని గైకొనినట్లు నీవు నడసి వాటిని గైకొనిన యెడల నిన్ను దీర్ఘాయుష్మంతునిగా చేసెదను." 1 రాజులు 9లో మనకిలాటి వివరణే ఉంది. దేవుడు సొలొమోనుకు రెండోసారి కనిపించి ఇలా చెప్పాడు:

> నీ తండ్రియైన దావీదు నడిచినట్లు నీవును యథార్థ హృదయుడవై నీతిని బట్టి నడుచుకొని, నేను నీకు సెలవిచ్చిన దంతటి ప్రకారము చేసి నా కట్టడలను విధులను అనుసరించినయెడల నీ సంతతిలో ఒకడు ఇశ్రాయేలీయుల మీద సింహాసనాసీనుడై యుండక మానడని నీ తండ్రియైన దావీదునకు సెలవిచ్చియున్నట్టు ఇశ్రాయేలీయుల మీద నీ సింహాసనమును చిరకాలమువరకు స్థిరపరచుదును. ( 4, 5 వచనాలు).

ఈ రెండు వచనాలను చదువుతుండగా ఆశ్చర్యపోతాం. దేవుడు తనకు ఆజ్ఞాపించిన మార్గాలన్నిటిలో దావీదు నడిచాడా? "ఒక నిమిషం ఆగు. బత్షెబతో పాపం చేసిన సందర్భంలో నీ పది ఆజ్ఞల్లో 40 శాతం అతిక్రమించాడు, దేవా మరచిపోయావా? నీవు అతనిని బట్టి ఎంతగానో కోపగించి ఇశ్రాయేలీయులలో 70,000 మందిని లయపరచిన సంగతి మరచిపోయావా?" "అవును, నేను మరచిపోయాను. నేను క్షమించిన పాపాలను నేను మరచిపోతాను.[59] నా సేవకుడైన దావీదు కలంనుండి వచ్చిన ఈ లేఖన భాగాన్ని మరచిపోయావా?" అన్నట్టు దేవుని జవాబును నేను ఊహించగలను.

> యెహోవా దయాదాక్షిణ్య పూర్ణుడు
> దీర్ఘశాంతుడు కృపాసమృద్ధిగలవాడు ...
> భూమికంటె ఆకాశము ఎంత ఉన్నతముగా ఉన్నదో

ఆయనయందు భయభక్తులు గలవారియెడల
ఆయన కృప అంత అధికముగా ఉన్నది.
పడమటికి తూర్పు ఎంత దూరమో **ఆయన మన**
**అతిక్రమములను మనకు అంత దూరపరచి యున్నాడు**
తండ్రి తన కుమారులయెడల జాలిపడునట్లు
యెహోవా తనయందు భయభక్తులు గలవారి యెడల జాలిపడును.
మనము నిర్మింపబడిన రీతి ఆయనకు తెలిసేయున్నది
మనము మంటివారమని ఆయన జ్ఞాపకము చేసికొనుచున్నాడు
(కీర్తన. 103:8-14; ఒత్తి పలకడం నాది).

దావీదు దేవుని సత్యంగా స్వీకరించాడు. అతని హృదయం దేవుని హృదయం వైపు మళ్లింది. దేవుడు అతనిని ప్రేమించాడు, దేవుడు అతనిని క్షమించాడు. "దావీదు నా మార్గములన్నిటిలో నడుచుచు, నా కట్టడలను ఆజ్ఞలను అనుసరించాడు. అతడు యథార్థ హృదయంతోను నేను అతనికి ఆజ్ఞాపించిన వాటన్నిటి విషయంలో నిటారుగా నడిచాడు. అతడు నా ఆజ్ఞలను నా కట్టడలను గైకొన్నాడు" అని ఆయన అతని ఎంచాడు!

కొన్ని క్రొత్త నిబంధన లేఖనాలను క్లుప్తంగా చూద్దాం. సన్‌హెడ్రిన్ ఎదుట అపో. 7లో స్తెఫను చేసిన గొప్ప ప్రసంగంలో పాత నిబంధన చరిత్రను అవలోకనం చేశాడు. అతడు దావీదు వద్దకు వచ్చినప్పుడు, "అతడు దేవుని దయ పొందాడు" అని తెలిపాడు (46 వ.). నా సమాధి రాయిమీద, "డేవిడ్ దేవుని దృష్టిలో కృపపొందాడు" అని వ్రాస్తే ఏమీ ఫరవాలేదు.

ఏదియెలాగున్నా, గమనించాలని నేను ప్రత్యేకంగా కోరే లేఖన భాగాలు - పిసిదియలోని అంతియొకయలోని సమాజ మందిరంలో పౌలు ప్రసంగమందు ఉపయోగించబడినవి: "తరువాత [దేవుడు] అతనిని [సౌలును] తొలగించి దావీదును వారికి రాజుగా ఏర్పరచెను. మరియు ఆయన - నేను యెష్షయి కుమారుడైన దావీదును కనుగొంటిని; అతడు నా యిష్టానుసారుడైన మనుష్యుడు, అతడు నా ఉద్దేశములన్నియు నెరవేర్చునని చెప్పి అతనినిగూర్చి సాక్ష్యమిచ్చెను" (అపో. 13:22). యాంప్లిఫైడ్ బైబిలు ఈ వచనపు చివరి భాగాన్ని వివరిస్తుంది: "యెష్షయి కుమారుడగు దావీదును నేను కనుగొంటిని, నా హృదయానుసారుడైన మనుష్యుడు, నా చిత్తమంతటిని జరిగించి, నా కార్యక్రమమంతటిని సంపూర్ణంగా నెరవేర్చుతాడు." తరువాత ఆ ప్రసంగంలో పౌలు యిలా అన్నాడు: "దావీదు దేవుని సంకల్పము చొప్పున తన తరమువారికి సేవ చేసి నిద్రించి, తన పితరుల వద్దకు చేర్చబడి..." (అపో. 13:36). జీవితంలోని అంతానికి మనం చేరుకున్నప్పుడు, "మన తరమువారికి దేవుని సంకల్పం చొప్పున సేవ చేసి నిద్రించెను" అని మన విషయమై చెప్పబడితే ఆశ్చర్యం కదూ?

రాజుగా దావీదుపట్ల దేవుని చిత్తం ఏమైయుంది? దావీదు పరిపాలనకు ఆయన కార్యక్రమమేమైయుంది? దావీదు సాధించినవన్నీ "దేవుని క్రింద ఒక జనాంగం" అని సంగ్రహం చేయవచ్చు: "ఒకే జనాంగం" గర్విష్టులై స్వతంత్రులైయున్న పన్నెండు గోత్రముల వారిని సమాధానంతో ఏక జనముగా దావీదు ఐక్యపరిచాడు. "దేవుని క్రింద" - ఇశ్రాయేలీయుల నిజమైన రాజు తాను కానని, యెహోవాయేనని దావీదు ఎల్లప్పుడు

నొక్కి చెప్పాడు. తన దేవునికి సాటిగా దావీదు ఎవనిని ఉండనియ్యడు. దావీదు సింహాసనానికి రాకముందు విగ్రహారాధన సమస్యగా ఉండేది. దావీదు మరణానంతరం తిరిగి అది సమస్యగా మారిపోయింది. దావీదు రాజై ఉండగా అది సమస్యగా లేనేలేదు. దావీదు విగ్రహారాధనను సహించడు.[60] దావీదు పాలన ఇశ్రాయేలీయులకు ఆత్మ సంబంధమైన అధిక స్థాయిగా ఉంది.

అప్పుడు, దావీదు విషయమై దేవుని తుదిపలుకు ఏమైయుంటుంది? అపొ. 13:22 మాటలు మరోసారి విను: దావీదు మరణానంతరం వెయ్యి సంవత్సరాల తరువాత, దేవుడు యింకను అతని గూర్చి యిలాటి భావనయే తెలియజేశాడు: "నేను దావీదును కనుగొన్నాను ... అతడు నా హృదయానుసారుడు." వాస్తవాలను మనం పరిశీలించిన తరువాత, మనం రుజువులను అటు యిటు మార్చి చూచాం. కాదనజాలని నిర్ణయానికి చేరుకున్నాం. "దావీదు నా హృదయానుసారుడు అన్నట్టు దేవుడు మనలను మన స్థానంలో ఉంచుతాడు – యింతకు అదే ప్రాముఖ్యమైయ్యింది."

నేను పరిపూర్ణుడను కాదు, అలాగే నీవు కూడా కాదు. దేవుడు కోరిన ప్రమాణాల సంగతి అటు ప్రక్కనుంచి, నేను ఎదురు చూచేదానిననుసరించియే నేను జీవించలేను. ఏదియెలాగున్నా, నేను ఒకటి మాత్రం చేయగలను, నా హృదయంలో దేవునికి మొదటి స్థానం యిచ్చి, దావీదువలె నేను ప్రయాసపడగలను. నా హృదయాన్ని ఆయన హృదయానికి అనుకూలపరచి నా జీవితాన్ని గడుప ప్రయత్నించగలను. నా జీవితంపై మనుష్యుల యొక్క తీర్మానం దయగా ఉండవచ్చు, లేకపోవచ్చు. వారు సరిగా భావించవచ్చు లేకపోవచ్చు. ఏదియెలాగున్నా, అంతంలో, ఒకే ఒక లెక్కింపు నిజంగా లెక్కింపుకు వస్తుంది. "డేవిడ్ – డేవిడ్ రోపర్ – నా హృదయానుసారుడు" అని దేవుడు అనగలిగినట్టయితే అది ప్రాముఖ్యం.

---

## ప్రసంగపు నోట్సు

ఈ పాఠంలో దావీదు చివరి దినాలు టి.వి కార్య క్రమంగా రూపుదిద్దుకున్నాయి. నీవు ఉన్న స్థలంలో యిది పనికి రాకపోతే, ఈ విధనాన్ని అనుసరించ లేక పోతే నువ్వొక స్టేజి నాటకంగా దీన్ని తీర్చిదిద్దవచ్చు. లేక ప్రార్థనా సమయాల్లోనూ, సంఘంలో విమర్శకులు కూర్చుని చర్చించే సమయాల్లో ప్రసగించవచ్చు.

అనేక స్థానిక సంఘాల్లో వృద్ధుల సంఖ్య పెదుగుతుంది. కాని వారి ప్రత్యేక అవసరతలకు కొద్ది పాఠాలే వినిపించబడుతూ ఉంటాయి. వయస్సు ఎదుగుతున్న మాలాటివారు రెండు సమస్యలను ఎదుర్కొనవచ్చు: (1) మనం ఒకప్పుడు చేసింది యిప్పుడు చేయలేకపోతే, మన గుర్తింపునే పోగొట్టుకొనవచ్చు. – అది వ్యాపారపు లోకంలోనేగాని, సంఘంలోనేగాని కావచ్చు. (2) మన కలలన్నీ నిజం కావు. మనకు చేతనైనంతే చేయగలిగియుండవచ్చు. తన చివరి దినాల్లో దావీదు ఈ రెండు సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది: (1) గతంలో అతడు చేసినట్టు పోరాడడానికి శక్తిగాని నేర్పుగాని లేదు. (2) దేవాలయం నిర్మించాలనే తన కలకు దేవుడు "వద్దు" అని బదులిచ్చాడు. దావీదు దేవాలయ నిర్మాణ విషయంలో తన జీవితంలోని సవాళ్ళను, తన

ఉద్దేశానికనుగుణంగా మార్చుకున్నాడు. "దావీదు వెనుక చూపుతో కాక ముందు చూపుతో మరణించాడనే ప్రతిపాదనను నేను యిష్టపడగలను."

దావీదు జీవితాన్ని ముగించడానికి మరో విధానం "అతడు పాడుకొంటూ వెళ్లాడు" "ఇశ్రాయేలీయులకు మధుర గాయకుడు" (2 సమూ. 23:1). కీర్తనలు మన జీవితం మీద ఎలా ప్రభావం చూపుతాయి అని కూడా ఈ పాఠాలను చెప్పవచ్చు. (1) క్రొత్త నిబంధనలో అవి కోట్ చేయబడ్డాయి, (2) మనం పాడే పాటల్లో అవి ఉంటాయి, మరియు (3) దావీదు కీర్తనలు మన హృదయాలతో ఇప్పటికే మాట్లాడుతుంటాయి.

---

సూచనలు

[1]W. Phillip Keller, *David, the Shepherd King* (Waco, Tex.: Word Publishers, 1986), 182. [2]2 సమూ. 21:1 "దావీదు యెహోవా ప్రసన్నతను వెదకగా" అని అంటుంది. [3]ప్రాచీనులు – జరిగిన దాని అంతటిలో దేవుని చేతిని చూచారు. ప్రకృతి సంబంధమైన ఆపదల ద్వారా మన దృష్టిని పొందాలని దేవుడు ఉపయోగించుకొంటున్నట్టు క్రొత్త పాత నిబంధనలు బోధిస్తున్నాయి. "దేవుడు నాకేదైనా చెప్పదలచుకున్నాడా?" మనం ప్రకృతి వైపరీత్యాలలో అడుగవలసియుంది. [4]యెహోషువ 9. [5]ఈ సంభవానికి మొదటి సమూయేలులో రికార్డు లేదు. 2 సమూ. 21:2 యిలా అంటుంది: "సౌలు ఇశ్రాయేలు యూదాల వారియందు ఆసక్తిగలవాడై వారిని హతము చేయ చూచుచుండెను." అది రాజకీయపరమయ్యింది కావచ్చు. ఇశ్రాయేలు యూదా వారి మెప్పుకొరకు జరిగియుండవచ్చు. [6]ఈ సెలక్షన్‌లో ప్రధానయాజకులు సహాయపడియుండవచ్చు. [7]దావీదు యోనాతానుకు తన వాగ్దానం నెరవేర్చిన తరువాత ఈ సంఘటన జరిగియుండవచ్చు (2 సమూ. 9). [8]ఈ ఏడుగురిని తుడిచి వేయడంతో యోనాతాను సంతతివారు తప్ప మిగిలిన సౌలు కుటుంబికులందరు తుడిచివేయబడియుండవచ్చు. దినవృత్తాంతాలలో యోనాతాను లైను మాత్రమే జాబితాలో చేర్చబడింది. దేవుడు సౌలు యింటివారిని నిరాకరించాడు. [9]రిస్పాతో అబ్నేరుకు అక్రమ సంబంధం ఉన్నట్టు ఇష్బోషెతు నిందమోపాడు (2 సమూ. 3). [10]మేరబు మొదట దావీదుకు వాగ్దానం చేయబడింది. ఆమే అద్రియేలుకు యివ్వబడింది. కొన్ని చేతిప్రతుల్లో మీకాలు ఉంది (KJV), మీకాలుకు పిల్లలు లేని కారణాన (2 సమూ. 6:23), వీరు మీకాలు సోదరియైన మేరబు యొక్క పిల్లలని భావించబడుతుంది. మీకాలు మేరబు పిల్లలను తన సొంత పిల్లలుగా పెంచుకుందని కొందరంటారు.

[11]రిస్పా అక్కడ బార్లి కోతకాలంనుండి ఉంది (మార్చినుండి మే వరకు) వర్షాలు సహజంగా కురిసేవరకు (నవంబరు, డిశంబరు) అంటే ఆరు, ఎనిమిది నెలలు అక్కడే ఉన్నట్టు. [12]ఈ సమయంవరకు సౌలు, యోనాతానుల ఎముకలు యాబేషులోని పిచుల వృక్షము క్రింద పాతిపెట్టబడియున్నాయి. అక్కడ యాబేషు-గిలాదువారు వారిని పాతిపెట్టారు (1 సమూ. 31:13). [13]దావీదు తన నిర్ణయంలో న్యాయ సమ్మతంగా చేసినట్టు వ్యాఖ్యానకర్తలు అన్నారు. "దేశం మీదికి శాపం" మరియు "రక్తానికి రక్తం" అని వారు అనేవారు. తరువాత వ్యాఖ్యానకర్తలు దానిని అంత స్థిరంగా నమ్మడం లేదు. [14]"దేవా మాకు నాయకులనిమ్ము" అనే పాఠంలో ఈ లేఖన భాగం వివరించబడింది. [15]తాను యికను యుద్ధమునకు రావద్దని దావీదు ప్రజలు తనకు వేడుకొనినది ఇక్కడే. [16]2 సమూ. 22; కీర్తనలు 18 ప్రాథమికంగా రెండూ ఒకటే. [17]2 సమూ. 21; 22లో దావీదు తన భక్తి జీవితాన్ని నొక్కి పలికాడు. [18]2 సమూ. 7. [19]ఈ సమాచారం ఈ వరుస పాఠాల్లో చాలా సార్లు ఉపయోగించబడింది. ప్రత్యేకించి "దేవా మాకు నాయకులను దయ చేయుము" అనేదానిలో చూడు. [20]1 దినవృ. 11:11లో "మూడు వందలు" అని ఉంది.

[21]ఆశాయేలు అబ్నేరుచే చంపబడ్డాడు (2 సమూ. 2). [22]1 దినవృ. 11వ అధ్యాయంలో ఈ జాబితా ఉంది. కొందరు యితరులు ఊరియా తరువాత పేర్కొనబడ్డారు. ఆ "ముప్పైమందిలో" కొందరు చనిపోగా యితరులను ఆ స్థానంలో ఉంచినట్టుంది. అలాగు దావీదు యొక్క "సైనిక వీరుల జాబితా" కొన్ని సంవత్సరాలు కొనసాగినట్టుంది. [23]"పెద్దవారి కొరకైన కథ" అనే పాఠంలో యింకా అధికమైన సమాచారం కొరకు చూడు. [24]జనాభా లెక్కలు తీయవలెనని దావీదు యోవాబును అడిగాడు. [25]2 సమూ. 24:9 చూడు. [26]1 దినవృ. 21:5లో వ్యత్యాసమైన సంఖ్య యివ్వబడింది. అయినా, 1 దినవృ. 21:6; మరియు 27:23, 24; జనాభా లెక్కలు పూర్తికాలేదని గుర్తించు. అసలు సంఖ్య ఎంతో ఎప్పుడే

తేటపడకపోవచ్చు. [27]తాను పాపం చేశాననే నిర్ణయానికి దావీదు ఎందుకు వచ్చాడో తెలియదు. 1 దినవృ. 21:7 ప్రకారం ప్రకృతి వైపరీత్యం అతన్ని అలా ఒప్పించియుంటుందా. దావీదు దేవుని దుఃఖపరిచానని తలంచాడా. [28]2 సమూ. 24:13లో "ఏడు సంవత్సరాల కరవు" అని ఉంది – సెప్టూజెంట్‌లోను 1 దినవృత్తాంతాలలోను మూడు సంవత్సరాలని ఉంది – మూడు సంవత్సరాలు, మూడు నెలలు, మూడు దినాలు (2 సమూ. 24:13 RSV, NIV యింకా యితర తర్జుమాల్లో). [29]అరౌనా, ఒర్నాను అని 1 దినవృ. 21:18నుండి పిలువబడ్డాడు. బైబిలు దినాల్లో అనేక మందికి ఒకటికంటె ఎక్కువ పేర్లుండేవి. [30]1 దినవృ. 21:28–30. పట్టణానికి సమీపాన దేవుడు ఆ స్థలాన్ని సూచించినట్లు గుప్తమైయుంది. సమయం చాలా ప్రాముఖ్యం. గిబియోనుకు వెళ్లడానికి దావీదుకు సమయం లేదు. అక్కడ దహన బలులు అర్పించే బలిపీఠం ఉండేది దీనికి ఎక్కువైన ప్రాముఖ్యత ఉంది. దేవాలయ నిర్మాణానికి స్థలం చూపించబడినట్టయ్యింది (1 దినవృ. 22:1; 2 దినవృ. 3:1).

[31]1 దినవృ. 21:20. [32]1 దినవృ. 21:20. [33]2 సమూ. 24:24లో కళ్లము ఎడ్లు ఏబది తులముల వెండికి కొనినట్టుంది. 1 దినవృ. 21:25లో "దావీదు భూమికి ఆరువందల తులముల బంగారము యిచ్చినట్టు ఉంది." ఇవి వేర్వేరు బేరాలైయుంటాయి. మొదటిది కళ్లము ఎడ్లు, రెండవది భూమి. దేవాలయ నిర్మాణానికి కావలసిన భూమి. [34]1 దినవృ. 21:26లో –"ఆయన ఆకాశములోనుండి దహన బలిపీఠము మీదికి అగ్నివలన అతనికి ప్రత్యుత్తరమిచ్చెను." కర్మెలు పర్వతం మీద జరిగినట్టుగానే అని ఊహించబడుతుంది (1 రాజులు 18:38). [35]1 దినవృ. 21:27, 28ఎ. [36]ఇక్కడ రెండు అవకాశాలున్నాయి. పరదేశీయులకు భయం కలిగేలా చేసియుండవచ్చు, లేదా ఇశ్రాయేలుతో యూదావారికి కలహం కలిగితే దాన్ని ఎదిరించడానికి యూదావారికి శక్తి ఉందో లేదో తేల్చుకొనడానికి. [37]దేవాలయానికి దావీదు సిద్ధపాట్లు గత పాఠంలో చర్చించబడ్డాయి. "పరిశుద్ధ భూమిమీద నిలుచుట ... దేవా, మాకు నాయకులనిమ్ము" అతని రాజ్య నిర్వహణ చర్చించబడ్డాయి. [38]1 దినవృ. 23:1. సరిగా సంఘటనల ముందు వెనుకలు మనకు సరిగా తెలియదు. 1 రాజులు 1; 2; 1 దినవృ. 23–29. ఈ పాఠంలో దాన్ని అమర్చడమనే ఒక అవకాశం. [39]దేవుని చిత్తమైతే 1, 2 దినవృత్తాంతాలు సొలొమోనుపై చర్చించినప్పుడు లోతుగా చూడవచ్చు. [40]షునేమి అనేది ఇశ్శాఖారుకు సంబంధించిన యెజ్రెయేలు ప్రాంతంలోనిది.

[41]అబీషగు దావీదు భార్యయని ఎన్నడు చెప్పబడనందున, అతడు ఆమెను పెండ్లి చేసికోలేదని కొందరంటారు. తాను అతని ఉపపత్నులలో ఒకతెయని నేను నమ్ముతాను. లేకుంటే దావీదుతో ప్రక్కలో పరుండడానికి దావీదు యిష్టపడకపోవచ్చు. దావీదు యొక్క అంతఃపురంలో అబీషగు భాగమైయుండకుంటే, అదోనీయా ఆమెను తనకు యిప్పించమని కోరినప్పుడు సొలొమోను బాధపడియుండేవాడే (1 రాజులు 2:22తో పోల్చు). [42]వెట్టకలుగుటయే ఈ ఏర్పాటు యొక్క ప్రధాన ఉద్దేశమని జోసీఫస్ అంటాడు (ప్రసంగి 4:11 చూడు). దావీదుకు అంతకు ముందే అనేక మంది భార్యలు, ఉపపత్నులున్నారు. వెట్ట కలిగించేలా వారు చేయగలరు. రాజ్యమంతటిలో బహు సుందరవతిని కనుగొనడం – ఆమె అందం రాజును ఉద్రేకపరచవచ్చుననేది కొందరి భావన. ఊహలు ఉన్నాయి వదలుతున్నా. [43]అదోనీయా సొలొమోను తప్ప మిగిలిన రాజ కుమారులను ఆహ్వానించాడంటే, సొలొమోను తరువాత రాజుగా అభిషేకింపబడతాడన్న సంగతి అతనికి తెలియునన్న మాట (1 రాజు. 1:9, 10, 19). [44]దావీదు కుమారులలో అదోనీయా నాల్గవవాడు (2 సమూ. 3:4). అమ్నోను అందరికంటె పెద్దవాడు, అబ్షాలోము మూడవవాడు. రెండవవాడు కిల్యాబు/దానియేలు చిన్న ప్రాయంలోనే చనిపోయినట్టు ఊహించబడుతుంది. [45] జీవించినవారిలో అదోనీయాయే పెద్ద కుమారుడైనందున రాజు కావాలనేది అతని కోర్కె అయ్యుండవచ్చు 1 రాజులు 1:6. అతడు రాజులా కన్పించేవాడని, తాను కోరినదేది తన తండ్రి కాదనలేదు అని అతడు తలంచియుండవచ్చు. (అతనితో తన తండ్రికి ఏ తంటా ఉన్నట్టు లేదు). [46]వారిద్దరు అదోనీయాతో ఎందుకు చేతులు కలిపారో తెలియదు. అదోనీయా జయించే పక్షంలో ఉన్నట్టును, అతని ప్రోత్సహించడం వారికి మేలు కలుగుతుందని తలంచియుండవచ్చు. బెనయ తన ఉద్యోగాన్ని పొందుతాడేమో అనే భయం యోవాబుకు కలిగియుండవచ్చు (1 రాజులు 2:3 చూడు). అబ్యాతారుకు సాదోకు అంటే అసూయ కలిగియుండవచ్చు. [47]అదోనీయా అబ్షాలోము చేవ్రాతను అనుసరించాడు. పిలువబడినవారు 1 రాజులు 1:8, 10లో పేర్కొనబడ్డారు. "షిమీ," "రేయీ" ఎవరో తెలియదు (1 రాజులు 1:8, 10). [48]"ఎన్‌రోగెల్" అంటే, "రోగెల్" ఊట అని అర్థం. [49]సొలొమోను రాజౌతాడని దావీదు తరచుగా ప్రస్తావించాడు. నాతాను, బత్షెబలు దావీదు యొక్క ప్రమాణాన్ని చేయించలేదు (1 రాజులు 1:13, 17), తన శరీరం కృషించినా, దావీదు యొక్క మనస్సు స్పష్టంగానే ఉంది. అలాటి వాగ్దానం తానే చేసినట్టు దావీదు ఒప్పుకొన్నాడు (1 రాజులు 1:30). [50]కుట్ర పన్నిన ఆ ముగ్గురు సంగతి లేక గతి 1 రాజులు 2లో దాఖలు చేయబడింది.

[51]దావీదు యొక్క చివరి దినాల్లో సొలొమోను యువరాజుగా ఉన్నాడు (1 రాజులు 1:46, 48 చూడు). [52]ఈ చివరి

బహిరంగ ప్రదర్శనకు సంబంధించిన వివరాలు 1 దినవృ. 28; 29ల్లో చూడు. [53]1 రాజులు 2:7. [54]పగతీర్చుకోవాలనే దావీదు సొలొమోనుతో చెప్పిన మాటలు అంతటిని పాడుచేసినట్టు మనకు భావన కలుగవచ్చు. అయితే అవి కఠినమైన క్రూరమైన దినాలు అని మనం జ్ఞాపకం ఉంచుకోవాలి. నన్ను నేను దావీదు స్థలంలో పెట్టుకొనడానికి ప్రయత్నించాను. నా మాటలు అంత సూటిగా లేకపోయినా, అపకారం చేసేవారి విషయంలో నేను నా కుమారుని హెచ్చరిస్తాను. [55]పలుమార్లు దేవునికి నమ్మకంగా ఉండుమని దావీదు సొలొమోనుకు హెచ్చరికలు చేస్తూ వచ్చాడు. ఇలాగు తన పెద్ద కుమారులతో చేసినట్టు రికార్డు లేదు. దావీదు ఆదర్శమైన తండ్రికాడు. అయితే కనీసం ఒక కుమారునితో ఆదర్శమైన తండ్రిగా ఉండ ప్రయత్నించాడు. [56]2 సమూ. 23:1–7లోని మాటలు "దావీదు యొక్క తుదిపలుకులుగా" చెప్పబడ్డాయి. [57]షిమీ అనేవాడు బ్రదుకుతాడని దావీదు వాగ్దానం చేశాడు గనుక (2 సమూ. 19:23), యిక్కడ షిమీని గూర్చి అతడు పలికిన మాటలు గ్రహించడానికి కష్టంగా ఉంటాయి. ముందు సాంప్రదాయ బద్ధమైన పండితులు దావీదును రైటన్నారు. నవీన పండితులు ఈ విషయంలో విభాగింపబడ్డారు. షిమీ చాలా పలుకుబడి గలవాడని, అందువలన సొలొమోనుకు అలా హెచ్చరిక చేశాడని కొందరి అభిప్రాయం. అది దావీదు యొక్క మానవత్వానికి ఉదాహరణయని కొందరి తలంపు. క్షమాపణకు చివరి మాట దావీదు కాదు – ప్రభువైన యేసు. [58]"పరిచయ" పాఠాన్నీ చూడు. [59]మనం మారుమనస్సు పొందినప్పుడు దేవుడు మన పాపాలను "మరచిపోతాడు" – యిర్మీయా 31:34; హెబ్రీ. 8:12. వాటిని ఆయన మనకు విరోధంగా తీసికొనిరాడు. సర్వమెరిగినవాడుగా సమస్తం జ్ఞాపకం ఉంటాయి. క్షమింపబడినవి లెక్కలోనికి తేడు. [60]1 రాజులు 9:6–9 గమనించు. 1 రాజులు 9:4, 5లో దేవుడు దావీదును గూర్చి చెప్పినదానికి యిది వెంట వస్తుంది.